# వెన్నెల విరిసింది

-వి.సత్యవతీదేవి

ఆ సాయంకాలం పేరంటానికి వెళ్లివచ్చింది మొదలు దమయంతికి మనసేం బాగాలేదు. ఏ పని చేసినా అన్యమనస్కంగానే చేస్తోంది. పిల్లలు గారాలు పోతే కసిరి దూరంగా తరిమింది. భర్త ఏదో అడగబోతే విసుక్కుంది. ఎప్పుడూ చిరున వ్వుతో వుండే భార్య అలా మూడీగా ఉండడంతో భర్త రంగారావుకి, పిల్లలకు ఏమీ అర్థం కాక నిశ్శ బ్దంగా ఎవరి పని వాళ్లు చేసుకోవడం మొదలుపె ట్టారు.

ఇంక వూరుకోలేక రంగారావు "ఏమిటి దమ యంతీ...నేను ఆఫీసు నుంచి వచ్చినప్పటి నుంచీ చూస్తున్నాను. అదోలా ఉన్నావు. ఏం జరిగింది?" అన్నాడు అనునయంగా.




భర్త అలా ప్రేమగా అడిగేసరికి దయమంతికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మాటిమాటికీ ఆమెకి సాయంకాలం జరిగిన సంఘటనే గుర్తుకొస్తోంది. రెండు వీధులకు అవతల ఉండే జానకమ్మగారు నిన్న వచ్చి 'మా సుమతికి సీమంతం చేస్తున్నాం. పేరంటానికి తప్పకుండా రావాలి' అని చెప్పారు.

సుమతిదీ తనదీ పుట్టిల్లు ఒక్క వూరే. అనుకో కుండా అత్తవారి ఇల్లు కూడా ఒకే ఊరు, పైగా దగ్గర దగ్గరే ఇళ్లు కావడంతో వారి స్నేహం విడి పోలేదు.

తనకసలు ఏ పేరంటానికి వెళ్లబుద్ధికాదు. కానీ స్నేహితురాలు బాధపడుతుందని, అందు లోనూ పెద్దావిడ మరీ మరీ చెప్పిందని కాదనలేక వెళ్లింది.

అక్కడికి ఎదురింటి మేడమీద ఉండే సావిత్రి కూడా వచ్చింది. తనను పలకరిస్తూ "కనీసం మీ ఆయన పుస్తెల తాడు కూడా చేయించలేదా పసుపుతాడుతో ఉన్నావు? మా ఆయన చెబుతా రులే మీ వారు గొప్ప నీతిమంతులని. పెళ్లాన్ని, బిడ్డలని ఈ స్థితిలో ఉంచడానికి తప్ప ఆ నీతి సూత్రాలు ఎందుకు పనికి వస్తాయి" అని వెటకా రంగా మాట్లాడింది. అక్కడున్నవారంతా ఆమె మాటలకు చిరునవ్వులు చిందించారేతప్ప ఇవేం మాటలని ఒక్కరు కూడా అనలేదు.

జానకమ్మ మాత్రం "ఏమిటి సావిత్రి... ఆ మాటలన్నీ ఇప్పుడు ఎందుకు" అన్నారు మంద లిస్తున్నట్లుగా.

"ఈమెను చూసి జాలి వేసి అలా అన్నాను గానీ...అయినా నాకెందుకులెండి" అంటూ వెళ్లి కూర్చుంది. దమయంతికి మాత్రం తల కొట్టేసి నట్లు అయింది. అంతమందిలో ఏం మాట్లాడాలో తోచక అవమానం జరిగినట్లు ఫీలవుతూ సుమతి వాళ్లు పిలుస్తున్నా వినకుండా గబగబా ఇంటికి తిరిగి వచ్చేసింది.

తరువాత జానకమ్మగారు ఇంటికి వచ్చి "ఆవిడ మాటలేం పట్టించుకోకమ్మా. కొందరి నైజం అంతే" అని చెప్పి వెళ్లిపోయారు.

కానీ ఎంత మరచిపోదామన్నా ఆమె మాటలు మనసుని చిందరవందర చేస్తున్నాయి. తనెప్పుడు పసుపుతాడుతో ఉన్నానని బాధపడ లేదు. ఆయన లంచాలు ముట్టరని మొదటి నుంచీ తెలుసు. దానికి తాను బాధపడలేదు సరి కదా గర్వపడుతుంది. ఆయనకొచ్చే జీతంతో పిల్లల చదువులు, పల్లెటూరిలో ఉండే అత్తమా మల మంచిచెడ్డలు... పండుగలు... ఇవన్నీ సక్ర మంగా నెరవేరుస్తున్నారు.

"ఏం...దమయంతీ...అడుగుతుంటే మాట్లా డవేం?" భర్త రెట్టించి అడిగేటప్పటికి ఆలోచన ల్లోంచి బయటపడ్డ దమయంతి సాయంకాలం జరిగిన సంఘటన అంతా చెప్పి కళ్లనీళ్లు పెట్టు కుంది.

"పిచ్చిదానా! అందుకేనా అంత బాధపడుతు న్నావు. నీకో సంగతి చెప్పనా... ఈ సంగతి ఇంకా ఆవిడకు చేరలేదు కాబోలు. అతని లంచావ తారం సంగతి పై ఆఫీసర్లకు తెలిసి సస్పెన్షన్ ఆర్డర్లు ఈ రోజే అతని చేతికి ఇచ్చారు. ఆ మహా నుభావుడు ఇంకా ఇల్లు చేరలేదు కాబోలు. పరువు పోయిన తరువాత ఎన్ని నగలు, ఎంత ఆస్తులు వుంటే ఏం లాభం చెప్పు. మన నీతే మనల్ని ఎప్పుడూ కాపాడుతుంది. లంచం తీసు కున్నవాడికి అసలు ప్రశాంతంగా నిద్రపడు తుందా? ఏ టైములో ఎవరొచ్చి పట్టుకుంటారో నన్న భయమే. ఏ ఆస్తులు లేకపోయినా సంతో షంగా లేమా చెప్పు" అన్నాడు రంగారావు.

భర్త మాటలతో మనసులో ముసురుకున్న చీకట్లు తొలగిపోయి ముఖంలో వెన్నెల విరిసింది దమయంతికి.

★